సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం • 3 • ఆగస్టు • 2024



నిలకడగా వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 2.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

వివరాలు 8లో ▸



నకిలీ గుట్టు తేలేనా..

నకిలీ సేంద్రియ ఎరువుల గుట్టు తేలడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.2 /25.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దిశగా ఆపరేషన్ ముష్కాన్ పని చేస్తుందని ఎస్పీ శ్రీనివాస రావు శుక్రవారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముష్కాన్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదిలో రెండు దఫాలు, 17 సంవత్సరాలలోపు బాలలను, బాలకార్మికులుగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని గుర్తిస్తుందన్నారు. వారికి ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ విభాగంలో పోలీస్, చైల్డ్‌వెల్ఫేర్, లేబర్, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థలు పని చేశాయన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు 18 మంది బాలకార్మికులను గుర్తించి వారికి విద్యావకాశాలు కల్పించామన్నారు. పనిలో పెట్టుకున్న యాజమానులకు జరిమానాలు విధించామన్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. బాలకార్మిక వ్యవస్థపై ఎవరైనా స్పందించి ఆయా శాఖల అధికారులకు సమాచారం ఇవ్వవచ్చన్నారు. చిన్నారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాలో బాలకార్మికులను గుర్తిస్తే డయల్ 100, 1098కు సమాచారం అందించాలన్నారు.

'నేతన్నకు బీమా' దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత: చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నేతన్నకు బీమా పథకం ప్రవేశపెట్టిందని.. అర్హులైన కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య తెలిపారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల పరిధిలో 18 ఏళ్లు నిండిన చేనేత కార్మికులు బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 9వ తేదీ నాటికి దరఖాస్తులను ఏడీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కొత్తగా జియోట్యాగ్ నంబర్ వచ్చిన వారు, గతంలో ఈ పథకంలో చేరని వారికి సైతం ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గద్వాల అర్బన్: రవాణా రంగ కార్మికులకు చట్టపరమైన రక్షణ కల్పించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు ఎటువంటి భద్రత చర్యలు చేపట్టకపోగా.. రవాణారంగ కార్మికులకు తీవ్ర నష్టాన్ని తీసుకొచ్చే చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంవీ యాక్టు 2019ను సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ప్రకటించాలన్నారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల ఉచిత ఉచిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మికులు షెక్షావలి, నర్సింహ, అశోక్, దేవరాజు, ప్రభుదాస్, నాగేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో కుంకుమార్చన



మల్దకల్/ ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని /జ్ఞాన సరస్వతీ ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవిని దర్శించుకున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

నేటి నుంచి సప్తాహ భజనలు..

ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి వారం రోజుల పాటు సప్తాహ భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు వారం రోజుల పాటు నిర్వహించే ఈ సప్తాహ భజన కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. భజన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నిధులు పక్కదారి

పురపాలికలు, రెవెన్యూ, జీపీల్లో దుర్వినియోగం



- ఇష్టారీతిగా ఖర్చు.. అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల నిబంధనల ఉల్లంఘన
- కేంద్ర, రాష్ట్ర ఆడిట్ సంస్థల నివేదికతో బట్టబయలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, గ్రంథాలయ సంస్థల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్టు రాష్ట్ర ఆడిట్‌లో బయటపడింది. 2020–21 సంవత్సరం జరిపిన లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును ఇటీవల విడుదల చేసింది. ఈ మేరకు మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, గ్రంథాలయ సంస్థల్లో నిబంధనలను ఉల్లంఘించినట్టు గుర్తించింది. ప్రత్యేకంగా కేటాయించిన నిధులను మరో పనులకు వినియోగించడాన్ని ప్రస్తావించింది. గడువులోగా ఖర్చుచేయాల్సిన నిధులను సద్వినియోగం చేసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం.. వినియోగించిన నిధులకు లెక్కాపత్రాలను చూపకపోవడంపై తీవ్రంగా స్పందించింది. పక్కదారి పట్టిన నిధులను తిరిగి చెల్లించాలని, రికార్డులను మళ్లీ అప్పగించాలని నివేదికలో పేర్కొంది.

జీపీ నిధులతో కారు అద్దె చెల్లింపు

నారాయణపేట జిల్లా పంచాయతీ అధికారి కారు అద్దె రూ. 33 వేల బిల్లులను దామగ్నాపూర్ జీపీకి సంబంధించిన సాధారణ నిధుల నుంచి చెల్లించారు. 2020 నుంచి ఇప్పటి వరకు ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు. ఇదే మండలంలోని మద్దెలబీడులోనూ సాధారణ నిధుల నుంచి రూ. 2.13 లక్షలు వైకుంఠధామం నిర్మాణానికి వినియోగించారు. వీటిని తిరిగి చెల్లించి, తమకు సమాచారం ఇవ్వాలని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు.

లెక్కా పత్రాలు కరువు..

ఇంటిపన్నుపై సర్‌చార్జీ రూపంలో ఒక్కో రూపాయికి 8 పైసల చొప్పున జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. అయితే మున్సిపాలిటీలు, జీపీల్లో వచ్చిన సొమ్మును గ్రంథాలయాలకు పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. గద్వాల జిల్లాలోని మున్సిపాలిటీలు, జీపీల నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు నిధులు సర్దుబాటు చేసినట్టు ఎలాంటి లెక్కలు లేవు. గ్రంథాలయ సంస్థ వద్ద సైతం వీటికి సంబంధించి ఎలాంటి రికార్డులను చేపట్టలేదు. లైబ్రరీ సెస్ ఎలా సేకరించాలి.. ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎలాంటి సమాచారం లేదని ఆడిట్ సంఘం ప్రస్తావించింది. లైబరీలో వార్తా పత్రికలకు సంబంధించిన రూ.1.90 లక్షల విలువగల ఓచర్లు, బిల్లులను ఆడిట్ సంస్థకు సమర్పించలేదు.

■ ఆడిట్ సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ రిజిస్టర్లు, ఫైళ్లను సంబంధిత అధికారులకు ఇవ్వనే లేదు. ఈ సంస్థకు సంబంధించిన ఆదాయ పన్ను, పెన్షన్ల చెల్లింపు, గ్రాట్యూటీ, కమ్యుటేషన్ చెల్లింపు, పీఆర్‌సీ ప్రొసీడింగ్స్, లైఫ్ సర్టిఫికెట్, అక్విటెన్స్ రిజిస్టర్లను తక్షణమే సమర్పించేలా చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొంది.

నిధులున్నా.. వినియోగంలో నిర్లక్ష్యం

ప్రభుత్వం నుంచి గ్రామాల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు మంజూరైనప్పటికీ.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సద్వినియోగం చేసుకోలేదు. దేవరకద్రలో 15వ ఆర్థిక సంఘం నుంచి ప్రత్యేక గ్రాంటు రూపంలో రూ.6,94,750 నిధులు మంజూరైనా.. వాటిని సకాలంలో వినియోగించుకోకపోవడంపై రాష్ట్ర ఆడిట్ సంఘం ఆక్షేపించింది. స్థానిక సంస్థలకు నిధుల సమీకరణ కోసం బకాయిల వసూళ్లు కీలకం కాగా.. దేవరకద్రలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్టు గుర్తించింది. పశువుల వేలం ద్వారా రావాల్సిన రూ.2.80 లక్షలను 2020 నుంచి చెల్లించకపోయినా జీపీ నుంచి ఎలాంటి చర్యలు లేవు. ఇదే పంచాయతీలో లైసెన్స్ ఫీజు రిజిస్టర్ పరిశీలనలో మీసేవ కేంద్రం నుంచి రూ.1.56 లక్షలు వచ్చినట్టు చూపించినా.. జీపీ నిధుల్లో మాత్రం రూ.60,400 మాత్రమే జమచేశారు. మిగిలిన రూ.96 వేలు జమ చేయకపోయినా సదరు పంచాయతీ కార్యదర్శిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇష్టారీతిగా నిధుల ఖర్చు..

నిధుల ఖర్చు, బిల్లుల చెల్లింపు విషయంలో శాఖాపరమైన నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా ఖర్చు చేసినట్టు రాష్ట్ర ఆడిట్ సంఘం ఆక్షేపించింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్‌లో అకౌంట్స్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండగా.. సదరు ఆఫీసర్ సెల్‌ఫోన్ బిల్లులను జనరల్ ఫండ్స్ నుంచి డ్రా చేశారు. బాలానగర్ మండల పరిషత్‌లో నిధులను ప్రభుత్వ ఖజానాలో కాకుండా బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, నిబంధనలను ఉల్లంఘించినట్టుగా గుర్తించింది. టీఎఫ్‌సీ, ఎస్ఎఫ్‌సీ వంటి పథకం కింద ప్రత్యేక ఖాతా తెరచి వాణిజ్య బ్యాంకుల్లో జమచేసినట్టు నివేదికలో పేర్కొంది.

■ నారాయణపేట జిల్లా కోస్గి మండల పరిషత్‌లో ఖర్చు చేసిన నిధులను రిజిస్టర్‌లో నమోదు చేయలేదు. ఈ మండల పరిషత్‌లో రూ.67 వేలతో పంపుసెట్ కొనుగోలు చేసి, మరమ్మతు కోసం నిధులను ఖర్చు చేసినా వీటి నమోదు వివరాలు సక్రమంగా లేవని ప్రస్తావించింది.

■ దేవరకద్రలో ఒకే పనికి పదుల సంఖ్యలో బిల్లులను విడగొట్టి నిధులు డ్రా చేసినట్టుగా తేలింది. బిల్లుల కోసం టెక్నికల్, పరిపాలన అనుమతులు పొందాల్సి ఉండటంతో, అనుమతులను తప్పించుకునేందుకే బిల్లులను చిన్న మొత్తాలుగా విడగొట్టి నిర్వహించినట్టుగా ఆడిట్ రిపోర్టులో ఆక్షేపించింది.

■ గద్వాల జిల్లా పరిషత్‌లో రూ.5.49 లక్షల పనికి బిల్లులు, సీనరేజ్ చార్జీలు, జీఎస్టీ, ఆదాయ పన్ను కింద సంబంధిత విభాగాలకు మినహాయింపులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. కానీ ఈ మేరకు తగ్గింపులను సంబంధిత విభాగాల అధిపతులకు పంపలేదని గుర్తించింది. నారాయణపేట జెడ్పీలోనూ జీఎస్టీ మినహాయింపుల కింద రూ.2.69 లక్షలు తగ్గించినప్పటికీ.. వాణిజ్యశాఖకు ఆ మొత్తాన్ని చెల్లించలేదు. వెంటనే మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని ఆడిట్ సంఘం పేర్కొంది.

శాకాంబరిదేవిగా జోగుళాంబ



తెలంగాణలోని ఏకైక శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని శుక్రవారం ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా శాకాంబరి దేవిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్‌లో అందంగా అలంకరించి ఆరాధించారు.

– జోగుళాంబ శక్తిపీఠం

వివరాలు 8లో..

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, పక్కన ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

గద్వాల రూరల్: స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమం నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ బీఎం సంతోష్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఐడీఓస కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం నిర్వహించనున్నామని, అందుకు సంబంధించి అధికారులందరూ అన్ని గ్రామాల్లో విధిగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారి, కార్యకర్త, ఆశలు, వీఓలతో కూడిన ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమం నిర్వహించాలన్నారు. అదేవిధంగా అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు గ్రామాలను సందర్శించి కార్యాచరణను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నీటిసరఫరా కలుషితం కాకుండా చూడాలన్నారు. పచ్చదనం కింద గ్రామాల్లో ముందస్తుగా ఖాళీ ప్రదేశాలను గుర్తించి, పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమాన్ని తహసీల్దార్లు, ఎంపీడీఓలు లీడ్ తీసుకుని పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయులు, ఆశాలు, విద్యార్థులు, స్థానిక నాయకులు, యువజన సంఘాల సభ్యులను భాగస్వాములు చేయాలన్నారు. ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీఓ రాంచందర్, జెడ్పీ సీఈఓ కాంతమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయులు

ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నందున, కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా నుంచి పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు హైదరాబాద్‌కు తరలివెళ్లినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలియజేశారు. పదోన్నతులు పొందిన 360 ఉపాధ్యాయులకు తొమ్మిది ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సులను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శన..

గద్వాల రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, పాఠశాలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన గద్వాల మండలం అనంతపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల మొత్తం కలియ తిరిగారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడారు. పుస్తకాల్లోని పాఠాలను చదివించి విద్యార్థులను పరీక్షించారు. అదే విధంగా కొంత మంది విద్యార్థులు స్కూల్ యూనిఫాం వేసుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ విధిగా స్కూల్ యూనిఫాం వేసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రతివిద్యార్థికి తప్పనిసరిగా రెండు జతల స్కూల్ యూనిఫాంలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉండటంతో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని తెలియజేశారు. అనంతరం ఆయన హెడ్‌మాస్టర్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ ఉమాదేవి, హెడ్‌మాస్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార ఎన్నికలకు రంగం సిద్ధం



జిల్లా సహకార కేంద్ర బ్యాంక్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సహకార ఎన్నికల కోలాహలం కనిపిస్తుంది. డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా జూలై 30వ తేదీన అనారోగ్య కారణాలతో చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే బాధ్యత డైరెక్టర్లపై పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 15 మంది డీసీసీబీ డైరెక్టర్లు కొనసాగుతున్నారు. వీరిలో కేవలం ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు కాగా, మిగతా 12 మంది టీఆర్ఎస్ డైరెక్టర్లు. మక్తల్ సింగిల్‌విండో నుండి చైర్మన్‌గా ఎన్నికై ఆ తర్వాత అనూహ్యంగా డీసీసీబీ చైర్మన్‌గా నిజాంపాష ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగారు. అనారోగ్య కారణాల వల్ల ఎట్టకేలకు పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. కాగా మొత్తం 15 మంది డైరెక్టర్లలో 8 మంది ఎవరిని బలపరిచినా వారే చైర్మన్ కావడం ఖాయం. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా సహకార అధికారి పద్మ నిజాంపాష రాజీనామా ఆమోదించినట్లు స్పష్టం చేశారు. కొత్త పాలక మండలి చైర్మన్ పదవి కోసం ప్రతిపాదనలు పంపాలని డీసీసీబీ సీఈఓకు సూచించారు. అయితే కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన మంజులారెడ్డి డీసీసీబీ చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి ద్వారా విష్ణువర్ధన్‌రెడ్డి పైరవీలు సాగిస్తుండగా, మంజులారెడ్డి మాత్రం నేరుగా సీఎం ద్వారా చైర్మన్ పదవి కోసం పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది.

అందరి సహకారంతోనే ముందడుగు

అలంపూర్: అన్ని రాజకీయ పార్టీల మద్దతుతోనే ఎస్సీ వర్గీకరణకు ముందడుగు పడిందని మాజీ ఎంపీ మందా జగన్నాథం పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అంశం స్పందన లేని సమయంలో ఆ కాలంలో సదాలక్ష్మి, టీవీ నారాయణ, వెంకటస్వామి వంటి కొద్దిమంది నాయకులతో మేమంతా కలిసి హైదరాబాద్‌లో లక్షలాది మంది జనసమీకరణ చేసి ఉద్యమాన్ని ప్రజల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో టీడీపీ ఎన్టీరామారావు ప్రత్యేకించి మాదిగలకు ప్రత్యేక స్థానం కల్పించినట్లు వివరించారు. ఆ తరువాత చంద్రబాబు నాయుడు ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ అమలు చేసినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాలతో నాయస్థానంలో వర్గీకరణ కొట్టివేసినట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ ఉద్యమాన్ని 30 ఏళ్లు సుదీర్ఘ పోరాటం చేశారన్నారు. వర్గీకరణ సాధనలో ఎన్నో ఒడిదుడుకులు, కుట్రలు కుతంత్రాలు జరిగినా.. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. న్యాయపరంగా పోరాటం చేసి, అంతిమంగా విజయం సాధించారన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ ఉపకులాలు, ఉద్యమంలో అమరులైన వారికి అంకితమన్నారు.

బంధించాలా.. వద్దా!

గద్వాల పట్టణంలో తీవ్రమవుతున్న వీధి కుక్కల దాడులు

- ప్రత్యేక సిబ్బందితో బంధించి తరలించే ప్రయత్నం
- జంతు సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- నిలిచిన శునకాల పట్టివేత
- తరలించాలంటున్న పట్టణ వాసులు



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది(ఫైల్)

గద్వాల: ప్రజా సంక్షేమమా.. నిబంధనలా.. ఏదీ తేల్చుకోలేని ఇరకాటంలో పడిపోయారు గద్వాల మున్సిపల్ అధికారులు. ప్రజలపై దాడులు చేస్తున్నాయనే కారణంతో పట్టణంలో కుక్కల బెడద నివారించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. అయితే, ఇది జంతువుల హక్కులను కాలరాయడమేనంటూ జంతు ప్రేమికులు చేసిన ఫిర్యాదు వీరి చర్యలకు అడ్డుపడింది. దీంతో కొన్ని రోజుల పాటు సాగిన కుక్కల పట్టివేత నేడు నిలిచిపోయాయి.

నిపుణులను రప్పించి...

కుక్కలను పట్టుకోవడం, వాటిని జాగ్రత్తగా దూర ప్రాంతాలకు తరలించడం అంత సులభమైన పనేం కాదు. ఏమాత్రం అనుమానం వచ్చినా శునకాలు తప్పించుకుంటాయి. అందుకే, నిపుణుల ద్వారా వాటిని తరలించే ప్రయత్నం చేస్తుంటారు. మున్సిపల్ అధికారులు సైతం రాజమండ్రి నుంచి పలువురి సిబ్బందిని రప్పించారు. స్థానికంగా వారికి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. పట్టుకొని, తరలించిన శునకాల సంఖ్య ఆధారంగా వారికి డబ్బులు చెల్లిస్తుంటారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఈ బృందం సభ్యులు తమ పని ప్రారంభించారు. ఇలా పట్టుకున్న కొన్ని కుక్కలను నల్లమల అటవీ ప్రాంతంలో క్షేమంగా వదిలేశారు. కొద్ది రోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుందని పట్టణవాసులు భావించారు. కాని, అనూహ్యంగా అది మధ్యలోనే నిలిచిపోయింది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో

స్వేచ్ఛగా తిరిగేందుకు, జీవించేందుకు జంతువులకు సైతం హక్కులుంటాయని జంతు ప్రేమికుల వాదన. ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే కారణంతో కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలేయడంతో వాటికి తగిన ఆహారం, నీరు దొరకక చనిపోయే ప్రమాదముందని, ఇది వాటి హక్కులకు భంగం కలిగించడమేననే భావన వ్యక్తం చేశారు. ఈ కారణంతోనే మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో, వారి సూచనల మేరకు గద్వాల పట్టణంలో కుక్కల తరలింపు ప్రక్రియ నిలిపివేశారు.

పెరిగిన దాడులు..



ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి అశ్విత

కాలనీల్లో పెరిగిన వీధి కుక్కలతో స్థానికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొన్ని రోజులుగా పిచ్చికుక్కల బెడద ఎక్కువవడం వారిని మరింత కలవరానికి గురిచేస్తోంది. ఇటీవల కాలంలో ప్రధాన రహదారులపై వెళ్లే పలువురు వాహనదారులపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వీరితో పాటు శ్రీనివాసకాలనీ, పాత హౌసింగ్‌బోర్డు కాలనీ, హమాలీకాలనీ, నల్లకుంట, సుంకులమ్మమెట్టు, ఓంటిలపేట, బీసీ కాలనీ, రాఘవేంద్రకాలనీ తదితర కాలనీల్లో కుక్కల డాడిలో పలువురు గాయపడిన సంగతి స్థానికంగా కలకలం సృష్టించింది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా పలువురు బాధితులు తీవ్రంగా గాయపడటంతో ప్రైవేటు, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందారు. రెండు రోజుల కిందట హమాలీ కాలనీలో ఇంటిఎదుట ఉన్న ఏడాదిలోపు చిన్నారి అశ్వితపై కుక్కదాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మరో బాలుడు సైతం కుక్క దాడిలో గాయపడ్డాడు. వారం రోజుల కిందట హోటల్‌లో పనిచేసే ఓ వ్యక్తి పనులు ముగించుకుని ఇంటికి సైకిల్‌పై బయలుదేరాడు. రాత్రి సమయం కావడంతో ఆరుబయట ఉన్న కుక్కలు అతడిపై దాడి చేసి గాయపర్చాయి. ఇలా వరుస ఘటనలు చోటుచేసుకుంటుండటంతో పలు కాలనీల నుంచి అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులొచ్చాయి. నియంత్రణ చేపట్టాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు.

తరలింపు నిలిపేశాం..



హైదరాబాద్‌కు చెందిన జంతు సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. వారి సూచనల మేరకు కుక్కల తరలింపు ప్రక్రియను నిలిపివేశాం. స్థానిక పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటాం. – బీఎస్ కేశవ్, మున్సిపల్ చైర్మన్, గద్వాల

వీధి కుక్కలను అరికట్టాలి..



వీధి కుక్కలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి. అధికారులు ఆ దిశగా కృషి చేయాలి. కుక్కలు స్వైర విహారం చేసి గాయపరుస్తున్నాయి. మరికొంత మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కల నియంత్రణకు తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి – శ్రీధర్‌గౌడ్, చిన్న అగ్రహారం, గద్వాల

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


లాలప్ప, చంద్రారెడ్డి (ఫైల్)

దామరగిద్ద: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన దామరగిద్ద మండలం మద్దెల్‌బీడ్ స్టేజీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దామరగిద్దకు చెందిన వీరప్ప తన బొలేరో వాహనంలో వ్యవసాయ కూలీలను నారాయణపేటకు తరలిస్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం కూలీలను తీసుకెళ్లిన అతడు.. నారాయణపేటలోనే వాహనాన్ని ఉంచి, స్వగ్రామానికి వచ్చాడు. సాయంత్రం కూలీలను తీసుకొచ్చేందుకు గాను తన మిత్రులైన లాలప్ప (18), చంద్రారెడ్డిలతో కలిసి వీరప్ప బైక్‌పై బయల్దేరాడు. మద్దెల్‌బీడ్ స్టేజీ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి కిందపడ్డారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న లాలప్పకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చంద్రారెడ్డికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణపేట ఆస్పత్రికి తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

యూటర్న్ తీసుకుంటుండగా..


వెంకటేశ్ (ఫైల్)

జడ్చర్ల: మోతీఘణాపూర్‌కు చెందిన చౌదని వెంకటేష్ (25) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తమ గ్రామం నుంచి బాలానగర్ మండల కేంద్రానికి వచ్చిన అతడు తిరిగి వెళ్తుండగా ఫరూఖ్‌నగర్ పరిధిలో ప్రమాదం జరిగింది. చింతగూడ పరిధిలోని జాతీయరహదారిపై యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో అతడి మోటార్ బైక్‌ను ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకుని తీవ్రవిషాదంలో మునిగిపోయారు. ఘటనతో బాలానగర్ నుంచి హైదరాబాద్ వైపుగా జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాగా షాద్‌నగర్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడు మృతి

ఊర్కొండ : ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు జరిగిన ఘటన ఊరుకొండ మండల కేంద్రంలో ని జడ్చర్ల కోదాడ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రేవల్లికి చెందిన రైతు లక్ష్మయ్య, కుమారుడు చంద్రయ్య (28) వ్యవసాయ పనుల నిమిత్తం టాక్టర్ తీసుకొని కల్వకుర్తి పట్టణానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిపై అతివేగం వల్ల ట్రాక్టర్ అదుపు తప్పింది. రోడ్డు ఒక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టడంతో బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న చంద్రయ్య అక్కడికక్కడే మరణించారు. తండ్రి లక్ష్మయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ వీరబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన లక్ష్మయ్యను మెరుగైన వైద్యం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో గురువారం రాత్రి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకి వెళ్తే.. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బట్టలు ఉతికేందుకు వినియోగించే లిక్విడ్‌ను తాగి అస్వస్థతకు గురైంది. గమనించిన తోటి విద్యార్థినులు విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందికి తెలియజేయడంతో చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ డైసిశృనాలినిని వివరణ కోరగా.. విద్యార్థిని ఇంటి వద్ద తల్లిదండ్రులు గొడవ పడుతుండటంతో మనస్తాపానికి గురై లిక్విడ్ తాగిందని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కాగా విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడంపై చర్చనీయాంశంగా మారింది. గురుకుల టీచర్లు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని పలువురు పేర్కొంటున్నారు.

మృతదేహం లభ్యం

పెబ్బేరు రూరల్: మండలంలోని తిప్పాయిపల్లి శివారులోని కృష్ణానది లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారని తెలిపారు. వ్యక్తి శరీరంపై తెలుపు రంగు జుబ్బా, బూడిద రంగు లాగు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. ఎవరైనా గుర్తిస్తే పెబ్బేరు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా శాకాంబరి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో జోగుళాంబ ఆలయం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

- వేదఘోషతో మార్మోగిన జోగుళాంబ క్షేత్రం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు
- శాకాంబరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

జోగుళాంబ శక్తిపీఠం: ఆషాఢమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో శాకాంబరి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పళ్లు, డ్రై ఫ్రూట్స్‌తో శాకాంబరిదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఒకే రోజు వివిధ విశేషాలు కలిసి రావడంతో ఆలయాలన్నీ అర్చకుల వేదఘోషతో మార్మోగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం ముక్కోటి దేవతా మూర్తులకు ప్రతిరూపమైన గోమాతకు భక్తులు పూజించి, వాటికి గోగ్రాసం సమర్పించారు. గో సహితంగా మంగళ వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సంకల్పసిద్ధి గణపతికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహాన్యాస పారాయణాలు పఠించారు. గర్భాలయంలో కొలువుదీరిన బాలబ్రహ్మేశ్వరుడికి రుద్ర నమక చమకాలతో 11 పర్యాయాలు అభిషేకాలు చేశారు. అనంతరం సృష్టిలోని ప్రాణకోటికి ఆకలి బాధలు లేకుండా ఉండాలని కాంక్షిస్తూ అన్నాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల మూర్తిపై అన్నంతో చక్కగా లింగాకృతిలో తీర్చిదిద్దారు. అలాగే మాస శివరాత్రిని పురస్కరించుకొని నందిమండపంలో భక్తులచే మృత్యుంజయ మహా మంత్రంతో రుద్రహోమాలు నిర్వహించారు.

- జోగుళాంబ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన అనంతరం శాంకాబరి పంచాకాన్ని పఠించారు. యాగశాల మండపంలో వారోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులచే సామూహికంగా చండీ హోమాలు చేయించారు. అలాగే ఆలయ ఆవరణలో అమ్మవారికి రథోత్సవం, ప్రదోష కాలంలో దర్బార్ సేవలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో బాలబ్రహ్మేశ్వరుడు

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దంపతులు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల డీఎస్పీ సత్యనారయణ దంపతులు, స్థానిక కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి కమలాపురం కవిత, కర్నూలు కన్జ్యూమర్ ఫోరం చైర్మన్ కిషోర్, జోగుళాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాస్ తదితరులు దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదలు అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించారు. కాగా, అమ్మవారికి అలకంరించిన కూరగాయలను బాలబ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో వినియోగించి, భక్తులకు అన్నదానం చేస్తామని ఆలయ ఈఓ తెలిపారు.

నకిలీ సేంద్రియం గుట్టురట్టు తేలేనా?

- అనుమతి లేకుండానే తయారీ
- అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

జడ్చర్ల: నకిలీ సేంద్రియ ఎరువుల గుట్టురట్టు తేలడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నారు. బాలానగర్ మండలం గౌతాపూర్ సమీపంలో గురువారం అనుమతులు లేకుండా గుట్టుగా తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పట్టుకున్న సంగతి విధితమే. ఈ నేపథ్యంలో తదుపరి ప్రక్రియపై అధికారులు కొంత ఉదాసీన వైఖరి అవలంభిస్తుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాంను సీజ్ చేసి పోలీసు కేసు నమోదు చేసినా చర్యలు ఎంత వరకు ఉంటాయన్న ఆందోళన నెలకొంది.

అనుమతులు లేకుండా ఎలా?

స్రేంధియ ఎరువుల తయారీ అంత ఆశామాషీ కాదు. ఇందుకు సంబంధిత వ్యవసాయ శాఖ, సేంద్రియ విభాగం ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఎరువులు తయారు చేయాలంటే అధిక విస్తీర్ణం కలిగిన భూమి కూడా అందుబాటులో ఉండాలి. అంతేగాక ఎరువుల నాణ్యత, పరిశీలన, ధ్రువీకరణ వంటి ప్రక్రియలు కొనసాగాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండానే ఇష్టానుసారంగా ఎరువులు తయారు చేసి కూలీలచే ప్యాకింగ్‌లు చేసి విక్రయాలకు పాల్పడడం ఏమిటని రైతాంగం ప్రశ్నిస్తుంది.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాలతో ముందుకు సాగుతామని బాలానగర్ మండల వ్యవసాయాధికారి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే గోదాంను సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశామని, శాంపిల్స్ తీయడం కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.


గోదాంను సీజ్ చేస్తున్న పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు(ఫైల్)

రాజకీయ ఒత్తిళ్లు

అనుమతి లేకుండా కొనసాగుతున్న సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రంపై జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేసి చర్యలకు ఉపక్రమించడంపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. పొరుగు జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒకరు తయారీ కేంద్రంకు చెందిన వ్యక్తికి బంధువుగా తెలిసింది. గోదాం సీజ్‌ను తొలగించాలని, ముందస్తు చర్యలకు వెళ్లొద్దని ఒత్తిడి తీసుకువస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

నిలకడగా కొనసాగుతున్న వరద

- జూరాల వద్ద 41 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.90లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. శుక్రవారం ప్రాజెక్టుకు 2.90లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 41 క్రస్టు గేట్లను ఎత్తి 2,73,646 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు దిగువన ఉన్న ఎగువ జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 18,147 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు 73.152 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఆవిరి రూపంలో 45, కుడి కాల్వ ద్వారా 658, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు-2కు 750, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 8.145 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 3,27,556 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 68.851 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


జూరాల ప్రాజెక్టు వద్ద దిగువకు విడుదలవుతున్న వరద నీరు

నారాయణపూర్ ప్రాజెక్టుకు 3లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు వద్ద 30 గేట్లను తెరిచి 2,85,820 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 23.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం సాయంత్రం ఇన్‌ఫ్లో పెరిగింది. గురువారం సాయంత్రం వరకు 1,50,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 1,70,500 క్యూసెక్కులకు పెరిగినట్లు బ్యారేజీ అధికారులు తెలిపారు. బ్యారేజీ భద్రత దృష్ట్యా 28 గేట్లు తెరిచి 1,67,728 క్యూసెక్కులు తుంగభద్ర నదిలోకి, కేసీ కెనాల్ గేట్లు ఎత్తి 2,354 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం అవుట్‌ఫ్లో 1,70,082 క్యూసెక్కులు ఉన్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు వివరించారు.

సోదరుల మధ్య భూ తగాదా

- ఇద్దరికి గాయాలు

గట్టు: సోదరుల మధ్య అర ఎకరా భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారం తగాదాకు దారితీసింది. దీంతో రెండు కుటుంబాలు కొట్టుకునే దాకా వెళ్లగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ మల్లేష్ కథనం ప్రకారం.. ఆరగిద్దకు చెందిన రావల్‌చెర్వు గోవిందుకు బ్యాండ్ తిమ్మప్ప, పెద్ద బతుకన్న, చిన్న బతుకన్నలు కుమారులు. కాగా గోవిందు పేరున ఉన్న 5 ఎకరాల పొలాన్ని పెద్ద కుమారుడు తిమ్మప్ప, చిన్న కుమారుడు చిన్న బతుకన్నలు తలా 2.5 ఎకరాల మాదిరిగా పంచుకున్నారు. ఏడాది క్రితం చిన్న బతుకన్న తనకున్న పొలంలో అరఎకరాను తిమ్మప్పకు విక్రయించారు. కాగా పొలం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈక్రమంలో రిజిస్ట్రేషన్ చేయించాలని ఏడాది క్రితమే పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. దీనిపై వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో చిన్న బతుకన్న ఏడాది కాలంగా కర్ణాటకకు వెళ్లి అక్కడే పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుండేవాడు. నెల క్రితం పెద్దల సమక్షంలో మరోసారి పంచాయతీ పెట్టగా, భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటే తనకు ఇంకా రూ. 2 లక్షలు అదనంగా ఇవ్వాలని అడిగాడు. కొన్న భూమిని ఎందుకు రిజిస్ట్రేషన్ చేయవని తిమ్మప్ప కుమారుడు చిన్న బతుకన్నను ఫోన్ చేసి ప్రశ్నించాడు. పొలం ఎలా దున్నుతావో చూస్తానని అన్నాడు. ఈ క్రమంలోనే చిన్న బతుకన్న, అతని భార్య రాములమ్మ గురువారం రాత్రి కర్ణాటక నుంచి ఆరగిద్దకు వచ్చారు. విషయం తెలుసుకున్న తిమ్మప్ప, అతడి కుమారులు జయన్న, నర్సింహులు, బామర్దులతో పాటుగా మేడికొండ గ్రామానికి చెందిన మరి కొంత మంది కలసి కట్టెలతో చిన్న బతుకన్న, అతడి భార్య రాములమ్మపై దాడి చేశారు. దీంతో వారిద్దరు గాయపడగా గద్వాల ఆస్పత్రికి తరలించారు. గోవిందు భార్య నర్సమ్మ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో 8 మందితో పాటుగా మరికొంత మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.


గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్న బతుకన్న

గుప్తనిధుల కోసం తవ్వకాలు



లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లి గ్రామ సమీపంలోని ఈద్గా వద్ద గుప్తనిధుల కోసం గురువారం రాత్రి తవ్వకాలు జరిపిన సంఘటన వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పొలంలోని పుట్ట వద్ద చెన్నంపల్లి, సాతాపూర్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు తవ్వకాలు జరిపారు. ఆ ప్రాంతంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పడి ఉండడం గమనించిన వారు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ జగన్‌మోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలియజేశారు.

13 రోజుల్లో 11 మంది మృతి

- వరుస మరణాలపై కొండాపురం గ్రామస్తుల ఆందోళన

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురంలో ఇటీవల చోటుచేసుకున్న వరుస మరణాలపై గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. కేవలం 13 రోజుల వ్యవధిలోనే వివిధ కారణాలతో 11 మంది మృతిచెందారు. వరుస మరణాలపై కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారానికి తెర లేపారు. ఈ విషయంపై 'సాక్షి' గ్రామస్తులను సంప్రదించగా.. తమ గ్రామంలో అనారోగ్య కారణాలతో మృతిచెందారు తప్ప.. ఇతర కారణాలతో మాత్రం కాదని అన్నారు. గ్రామస్తుల్లో భయాన్ని పోగొట్టేందుకు హోమం నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు.


శ్రీశైలం ఆనకట్ట వద్ద తిలకిస్తున్న సందర్శకులు

శ్రీశైలం ఆనకట్ట వద్ద సందర్శకులు



దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట వద్ద సందర్శకులు పోటెత్తారు. శుక్రవారం బైకులు, కార్లలో ఆనకట్ట ఘాట్‌రోడ్డు ములుపుల వద్దకు చేరుకున్నారు. ఆనకట్ట చుట్టూ సందర్శకులే, వీరందరు సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. కాగా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం కోసం పోలీసులు తీవ్రంగా శ్రమించారు. శని, ఆదివారం శ్రీశైలం ఆనకట్ట వద్ద మరింత పోటెత్తే అవకాశాలున్నాయి.

సెల్ఫీ తీసుకుంటున్న దంపతులు

జానంపేటలో మూడు ఇళ్లలో చోరీ


జానంపేటలో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో మూడు ఇళ్లలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపురం మండలంలోని, జానంపేటకులోని శ్రీరాంరెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఇళ్లకు తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పనుల నిమితం వెళ్లిపోయారు. వారు సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు విరగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. బీరువా తాళాలు విరగొట్టి, తలుపులు తెరుచుకొని ఉన్నాయి. శ్రీరామ్‌రెడ్డి ఇంట్లో రూ.1.43లక్షల నగదు, ఎడ్లమల బాల్‌రెడ్డి ఇంట్లో 2 తులాల బంగారం, రూ.60 వేల నగదు, వెంకట్‌రెడ్డి ఇంట్లో రూ.50 వేల నగదు పోయిందని ముగ్గురు బాధితులు శుక్రవారం ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

నాగర్‌కర్నూల్‌లో మొబైల్ దుకాణంలో..

నాగర్‌కర్నూల్ క్రైం: మొబైల్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన తిరుపతి బస్టాండ్ ముందున్న ఎస్పీ కాంప్లెక్స్‌లో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మొబైల్ దుకాణం షెటర్ తెరిచి రూ.95 వేలు చోరీ చేశాడు. బాధితుడు తిరుపతి మొబైల్ దుకాణానికి వచ్చి చూడగా.. షెటర్ తెరిచి ఉండటం గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో వాటిని సేకరించారు. సంఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గోవర్ధన్ తెలియజేశారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

పెబ్బేరు రూరల్: చోరీ కేసులో పట్టుబడిన నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో వివరాలు వెల్లడించారు. పెబ్బేరు మండలం, కొత్త సూగూరుకు చెందిన చుక్క శ్రీకాంత్‌ను గురువారం తెల్లవారుజామున ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. దీంతో అదే గ్రామంలో జూలై 31న తెలుగు పరమేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువాలోని 2.5 తులాల బంగారం నాను, 3 మాసాల మాట్నీలు రెండు, గ్రాము నర బంగారం చిన్న ఉంగరాలు, 3 తులాల వెండి మొలతాడు చోరీ చేసినట్లు ఒప్పుకొన్నాడు. ఆ నేరస్తుడిని అరెస్టు చేసి చోరీ చేసిన వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలియజేశారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.


పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి

రియల్ ఎస్టేట్ వ్యాపారులపై విచారణ

అయిజ: రియల్ ఎస్టేట్ చేసేందుకు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులకు ఎరచూపి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నారని వస్తున్న ఆరోపనలపై పోలీసులు శుక్రవారం విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో గుజరాత్ రాష్ట్రంలోని గాంధీ నగర్‌కు చెందిన కుందన్ మక్వాన మండల కేంద్రంలో కార్యాలయం ఏర్పాటు చేసుకుని వివిధ రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నాడు. అయితే అయిజ పట్టణంలోని కొందరు వడ్డీ వ్యాపారస్తులతో పరిచయాలు పెంచుకున్నాడు. వారి నుంచి అప్పు తీసుకొని రూ.లక్షకు నెలరోజులకు రూ.40 వేలు అదనంగా తిరిగి ఇస్తానని, గ్యారంటీ కోసం అప్పు ఇచ్చిన వారికి పోస్ట్ డేట్ చెక్కులు ఇస్తామని చెప్పి వడ్డీ వ్యాపారుల నుంచి డబ్బు తీసుకుంటున్నట్లు ఆరోపనలు ఉన్నాయి. వడ్డీ వ్యాపారుల నుంచి నగదు ఇప్పించిన వ్యక్తులకు కమీషన్ పేరుతో కొంత డబ్బు ఇస్తున్నారని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన ఉన్నవారు కొంత మంది అప్పు ఇచ్చినట్లు ఉదంతులు వ్యాపించాయి. మూడు నెలల్లో సుమారు రూ.10 కోట్ల వరకు వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నట్లు ఆరోపనలు రావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విషయంపై ఎస్‌ఐ విజయభాస్కర్‌ను వివరణ కోరగా.. ఇంత వరకు ఎవ్వరూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఈ విషయంపై ఆరోపనలు రావడంతో గుజరాత్‌కు చెందిన కుందన మక్వానతో పాటు మండలంలోని తూంకుంటకు చెందిన గజేందర్ గౌడ్‌ను విచారణ చేస్తున్నామని తెలిపారు. వ్యాపారం నిబంధనల ప్రకారం చేస్తున్నామని, పుకార్లు నమ్మవద్దని నిందితులు పోలీసులతో వాపోయారు. అందుకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు చూయించారు. మరికొన్ని డాక్యుమెంట్లు శనివారం చూయిస్తామని పోలీసులకు తెలిపారు. పూర్తి విచారణ జరిగితే గాని అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.


రియల్ ఎస్టేట్ వ్యాపారీ కార్యాలయం ఎదుట విచారణ చేస్తున్న పోలీసులు